# శృంగార పురుషుడు

'శృంగారం...

శృంగారం -

దాన్నే 'సెక్స్' అంటారట కూడా!

కాని, 'సెక్స్' అంటే- 'ఆడ-మగకు సంబంధించిన జాతిభేదం' అని మాస్టారు చెప్పారు.

అసలు 'సెక్స్' అంటే ఏమిటి? 'సెక్స్, శృంగారం' ఒకటేనా?

ఒక అమ్మాయి, ఒక అబ్బాయి నవ్వుకుంటూ ఒకరినొకరు చూసుకుంటుంటే... 'శృంగారం' అంటారనీ, 'ప్రేమ' అంటారని అంటూ వుంటే విన్నాడు తను. మధ్యలో ఈ 'ప్రేమ' ఏమిటి? అసలు ఈ 'శృంగారం' అంటే ఏమిటో పరిశోధన చెయ్యాలి!'

- శీను ఆలోచనలు వడివడిగా పరుగెడుతున్నాయి.

రాత్రి పదవుతోంది!

అమ్మా నాన్న, తనూ అన్నాలు తిన్నారు. దూరంగా శీను కుర్చీలో కూర్చుని చదువుకుంటున్నాడు. నాన్న ఏమిటో, అమ్మను అదేపనిగా చూస్తున్నాడు. ఇద్దరూ ప్రక్కప్రక్కనే సోఫాలో కూర్చున్నారు. నాన్న ఒక్కోసారి అమ్మ మీద పడినంత పని చేస్తున్నాడు. అమ్మ శీనుని చూపించి "ఏమిటి మీరు మరీనూ- కాస్సేపు ఆగలేరూ? వాడిని నిద్దరపోనీయండి!" అంటోంది నవ్వుతూ.

ఆ నవ్వేటప్పుడు అమ్మ బోలెడు సిగ్గుపడిపోతోంది. ఎందుకు అంత సిగ్గు? నాన్నేగా!

శీను చాలాసేపు చదువుకుని మంచంపై పడుకున్నాడు.

అమ్మా, నాన్నా కూడా పడుకున్నారు.

శీనుకు నిద్దర పట్టేసింది. శీను పరిశోధన ఇలా వాయిదా పడింది!

●

అమ్మా, నాన్న, తనూ ఒక పెళ్ళికి వెళ్లారు.

పెద్దగా మంత్రాలు చదువుతున్నారు బ్రాహ్మలు.

భజంత్రీల గోలలో బ్రాహ్మల మంత్రాలు ఎవరికీ వినపడటం లేదు. అయినా గొంతు చించుకుంటున్నారు వాళ్ళు.

పెళ్ళికొడుకుని తీసుకువచ్చి కూర్చోపెట్టారు. అతను ఎంతో సంతోషంగా వున్నాడు. ఏమిటో పిచ్చాడిలా మహా సంబరపడిపోతున్నాడు.

ఈలోగా... ఒక బుట్టలో పెట్టి అమ్మాయిని తీసుకువచ్చారు. ఆ అమ్మాయి నడవకూడదులా వుంది. ఆ అమ్మాయి పెళ్ళికొడుక్కి కనపడకుండా తెర కట్టారు. అతను ఆ తెరలోంచి అమ్మాయిని చూడడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాడు.

కొంచెంసేపటికి తెర తీశారు!

ఆ అమ్మాయిని అదేపనిగా చూస్తున్నాడా అబ్బాయి. అమ్మాయి సిగ్గుతో ముడుచుకు పోతోంది. ఆ అమ్మాయి ముడుచుకుపోయేటప్పుడు శీను తను ఆడుకునేటప్పుడు గాజుపురుగును ముట్టుకుంటే ఉండలా ఎలా ముడుచుకుపోయేదో గుర్తుకువచ్చింది.

కాస్సేపటికి ఆ అమ్మాయి మెడలో పసుపుతాడు కట్టేశాడు అతను. ఆ తరువాత ఇద్దర్నీ ప్రక్కప్రక్కనే కూర్చోపెట్టారు.

అబ్బాయి ఆనందానికి పగ్గాలు లేవు. ఆ అమ్మాయిని రాసుకునేట్లుగా కూర్చున్నాడు.

ఆ తరువాత పసుపు కలిపిన బియ్యం చాలా కిలోలు వుంటాయి. ఒకళ్ళ మీద ఒకళ్ళు పోసుకున్నారు.

ఏమిటో... పిచ్చివాళ్ళు- మంచిబియ్యాన్ని పాడుచేసి పసుపు చేసేశారు. అసలే కరువు... బియ్యం దొరకడం లేదు. బోల్డు ఖరీదు అంటుంటారు- అమ్మా నాన్న! మరి, ఇదేమిటి?

తరువాత పనిమనిషి వచ్చి ఆ బియ్యం తీసుకువెళ్లింది. పులిహోర చేసుకుంటుం దేమో... పసుపు బియ్యం కదా!

పెళ్ళి అయ్యాక శీనువాళ్ళు కొన్ని రోజులు అక్కడే వున్నారు.

ఒకరోజు రాత్రి ఆ పెళ్ళి అయిన అమ్మాయినీ, అబ్బాయినీ ఒక గదిలో మంచం మీద కూర్చోబెట్టారు. వాళ్ళు తెల్లని బట్టలు కట్టుకున్నారు. మంచం నిండా బోల్డు మల్లెపూలు, గది నిండా అగరవత్తుల వాసన!

ఇద్దరిచేతా అందరికీ తాంబూలాలు ఇప్పించారు. తనకీ, ఇంకా కొంతమందికి పెళ్ళి అవలేదని ఇవ్వలేదు. తరువాత- పాపం... వాళ్ళిద్దర్నీ ఆ గదిలోనే ఉంచేసి- తలుపుకు గొళ్లెం పెట్టి, దుర్మార్గుల్లా నవ్వుకుంటున్నారు... పెళ్ళిచేసిన వాళ్ళంతా.

శీనుకు లోపలవున్న వాళ్ళని చూస్తే జాలేసింది.

కాని-

తలుపులు వేసేముందు వాళ్ళని చూశాడు. ఎంతో సంతోషంగా వున్నారు వాళ్ళు. అలా లోపల ఉండటం వాళ్ళకి సంతోషమేమో?! ఏమో మరి?!

తను 'శృంగారం' సంగతి తెలుసుకోవాలంటే... ఇలాంటివి ఎన్నో చూడాలి.

ఆ మరుసటి రోజు శీను వాళ్ళు ఇంటికి వచ్చేశారు.

●

రోజులు గడుస్తున్నాయి...

శీను బాబాయి, పిన్నీ వచ్చారు. బాబాయికీ, పిన్నికీ పెళ్ళయి ఎన్నాళ్లో అవలేదుట!

బాబాయి అమితాబ్‌లా ఉంటాడు. పిన్ని శ్రీదేవిలా ఉంటుంది. బాబాయి ఎప్పుడూ పిన్నిని జిగురుతో అంటించుకున్నట్లుగా ప్రక్కనే ఉంటుంటాడు.

ఒకసారి తాను పుస్తకాల కోసం వెతుక్కుంటుంటే- బాబాయి... ఛీ-సిగ్గులేదు... పిన్ని నోట్లో నోరు పెడుతున్నాడు. ఎంగిలి కదా!

అయినా సరే... పిన్ని సంతోషంగా కళ్ళు మూసుకుంది.

తనను చూసి- "శీనుగాడు వచ్చాడు... మీరు ఊరుకోండి ఇక!" అని బాబాయిని తోసేసింది. బాబాయి వెళ్లిపోయాడు బయటికి.

కాస్సేపు తను రాకుండా వుంటే వీళ్ళ శృంగారం చూసేవాడే- బలే మిస్సయిపోయాడు!

అన్నింటికీ ఈ శీనుగాడు అడ్డు వస్తున్నాడు. ఈ శీనుగాడు పెద్దోడే కదా... ఎందుకు చూడకూడదు?

ఆరోజు-

బాబాయి ఏదో పుస్తకం చూస్తున్నాడు. దాని నిండా అన్నీ బొమ్మలే!

"బాబాయి... నాకు ఒకసారి ఇవ్వవా ఆ పుస్తకం! చూసి ఇస్తాను..." అన్నాడు శీను.

"నువ్వు చూడకూడదురా!" అన్నాడు బాబాయి.

బాబాయి పిన్నికోసం లోపలికి వెళ్తే- తను బాబాయి దిండు క్రింద దాచిన ఆ పుస్తకం తీసి చూశాడు.

ఆ పుస్తకంలో... ఒక్క అమ్మాయికి గాని- ఒక్క అబ్బాయికి గాని- వొంటి మీద బట్టలు లేవు. బట్టలు లేకుండా శృంగారం ఏమిటి? ఛీ... ఏమిటో?!

శీనుకు బోధపడటం లేదు.

●

ఒకరోజు మామయ్య కూతురు సీతను ఎవరో తీసుకువచ్చి తమ ఇంట్లో దిగబెట్టారు.

ముళ్ళపూడి వెంకటరమణ 'రెండు జళ్ళ సీత' అని ఎలా పేరుపెట్టాడో కాని, మామయ్య కూతురు అచ్చం అలాగే వుంటుంది.

"సీతా..." అని పిలిచాడు శీను.

"ఏయ్ఁ... ఏమిటా పిలుపు?" అంది.

"నీ కోసమే చూస్తున్నాను. నాకు తోడు ఎవరూ లేరు... ఏమిటోగా వుంటోంది ఈ మధ్యన!" అన్నాడు శీను.

"ఏం... ఎలా వుంది? వళ్ళు తిమ్మిరిగా వుందా?" అంది అష్టవంకర్లు తిరుగుతూ.

సీతతో పాటుగా తను కూడా కనీసం మూడు వంకర్లు తిరిగి వూరుకున్నాడు.

సీతను చూస్తుంటే... తనకు ఒకరోజు రాత్రి అమ్మా, నాన్నగారు మాట్లాడుకున్న విషయం గుర్తుకువచ్చింది.

"శృంగారం అంటే... బంగారం లాంటిదోయ్!" అని నాన్నగారంటే-

"పోదురూ... శృంగారం బంగారం! మీకు పిచ్చి పట్టింది!" సిగ్గుతో అంది అమ్మ.

నాన్నగారు "కాదోయ్ఁ... బంగారానికి ఎలా విలువ పెరిగిపోతుందో- అలాగే శృంగారానికి కూడా విలువ పెరిగిపోతుందన్నమాట!" అని నవ్వారు.

అమ్మ కూడా నాన్నగారి నవ్వుతో శృతి కలిపింది.

అచ్చంగా... ఆ బంగారంలా పచ్చగా, బొద్దుగా వుంటుంది... ఈ బండముండ సీత- తనని 'బావా..!' అని పిలుస్తుంటే!

సీతని బట్టల్లేకుండా చూడాలనిపించింది శీనుకు.

ఒకసారి సీత బట్టలు కట్టుకుంటుంటే... తెలియనట్టుగా వెళ్లాడు గదిలోకి.

"సిగ్గులేదూ... ఆడాళ్ళు బట్టలు కట్టుకుంటుంటే అలా వచ్చేస్తావ్?!" అంటూ మండిపడింది.

●

ఆ రోజు శుక్రవారం!

ఆడాళ్ళందరూ తలంటుకుంటున్నారు. సీత కూడా తలంటుకుంటోంది.

సీతకు దొడ్లో చప్టాలో నీళ్లు పెట్టింది అమ్మ.

శీను ఇదే సందనుకుని దొడ్లోకి, చప్టాకి వెళ్లే దారిలో ఉన్న తలుపుకి ఉన్న చిన్న చిల్లులోంచి చూడసాగాడు.

సీత స్నానం మొదలైంది!

సీత అటుతిరిగి కూర్చుంది. అమ్మ తలపై నురుగుపోసి రుద్దుతోంది.

శీను చిల్లులోంచి చూస్తున్నాడు. నిలబడి వొళ్ళు తోముకుంటోంది సీత. నిజంగా రబ్బరు బొమ్మలా ఎంత బాగుందో సీత?!

కాని- ఇదేమిటి? సీతను బట్టలు లేకుండా చూసినా కూడా తనకు శృంగారపు టాలోచనలు రావడం లేదు?? నాన్న చెప్పినట్లు- నిజంగా శృంగారం బంగారం లాంటిదేమో! అందరికీ శృంగారం కలగదన్నమాట!

శీను, సీత అందాల్ని చిల్లులోంచి చూస్తున్నాడు.

ఇంతలో... శీను డిప్ప పగిలింది.

"వెధవాయ్ః... ఏమిటి నువ్వు చేసేది?" తల ఎత్తాడు. ఎదురుగా... నాన్నగారు!

ఏడుస్తున్నాడు శ్రీను. నాన్నగారితో అంటోంది అమ్మ- "ఎక్కడికి పోతాయి పోకిరీ వేషాలు? మీలాగే వాడూను!"

పాపం... శీను ఏడుస్తున్నాడు.

ఈ శృంగార పురుషుడు... శీను వయస్సు- నిఝంగా తొమ్మిదో సంవత్సరం! చదివేది- నాలుగో తరగతి!

మరి, బంగారుబొమ్మ సీత... ఇంకా చిన్నది!

హుష్షః..!!!

●

'పల్లకీ' వారపత్రిక... 9 మే' 1985 సంచికలో ప్రచురితం